
TGTEL/25/A3750

... నిజమే ...

# నిజాయితీ

https://nijamenijayathi.com తెలుగు దిన పత్రిక

"నిజాయితీ" ఒక ముఖ్యమైన నైతిక లక్షణం ఇది విశ్వసనీయత, విధేయత మరియు సమగ్రతను పెంచుతుంది.



ఎడిటర్ : బొడ్డుపల్లి మల్లయ్య సంపుటి 1 సంచిక 35 ప్రింటర్ : గుండూర్ శ్యామ్ . సోమవారం 22 డిసెంబర్ 2025 వెల 4:00

## పబ్‌లో దూరి సాయుధుల కాల్పులు.. 9 మంది మృతి



**హైదరాబాద్, డిసెంబర్ 20 (నిజాయితి) :** జోహెనెస్‌బర్గ్ : దక్షిణాఫ్రికాలోని బెక్కెర్స్‌డల్ పట్టణంలో ఓ పబ్ వద్ద రక్తపాతం జరిగింది. ఆదివారం తెల్లవారుజామున కొందరు సాయుధులు జరిపిన విచక్షణారహిత కాల్పుల్లో తొమ్మండుగురు మృతి చెందారు. కనీసం పది మంది వరకూ గాయపడ్డారు . మృతుల్లో ముగ్గురు బాలలు కూడా ఉన్నారు. ఈ విషయాన్ని అధికార వర్గాలు ఆదివారం మధ్యాహ్నం వెల్లడించాయి. జోహెన్స్‌బర్గ్‌కు దాదాపు 46 కిలోమీటర్ల దూరంలో అర్ధరాత్రి తరువాత కోలాహలంగా ఉన్న పబ్ ఒక్కసారిగా తెల్లటి మిని బస్సులో, సిల్వర్ సెడాన్ వాహనంలో వచ్చిన గుర్తు తెలియని వ్యక్తుల దాడితో హాహాకారాలతో దద్దరిల్లింది. వస్తూనే వారు ముందుగా పబ్ నిర్వాహకులను ఎంచుకుని కాల్పులకు దిగారు. తరువాత కూడా పబ్‌కు వచ్చిన వారిపై వారి కాల్పులు సాగాయి. ఈ క్రమంలో తూటాలకు బలి అయ్యి చనిపోయిన వారి సంఖ్య తొమ్మిదిగా నిర్ధారణ అయింది.

టాంబో సెక్షన్‌లోని క్వానాకోలో టావెర్న్ వద్ద ఈ పబ్ నెలకొని ఉంది. కాల్పులకు దిగి అక్కడి నుంచి దుండగులు వెంటనే తమ వాహనాలలో అక్కడి నుంచి పారిపోయారు. వీరు వెళుతూ వెళ్లుతూ పట్టణంలో జనంపై కూడా కాల్పులకు దిగినట్లు తెలిసింది. దుండగుల ఆచూకి కోసం గాలిస్తున్నట్లు ప్రాంతీయ పోలీసు కమిషనర్ మేజర్ జనరల్ ఫ్రెడ్ కెకనా మీడియాకు తెలిపారు. మృతులలో ఒకరు పబ్ వెలుపల ఉన్న టాక్సీ కారు డ్రైవర్ అని వివరించారు. ఇటీవలి కాలంలో పలు ప్రాంతాలలో అర్ధరాత్రి వరకూ సాగే పబ్‌లు, బార్లను ఎంచుకుని సాయుధులు దాడులకు దిగుతున్న ఘటనలు జరుగుతున్నాయి. ఇక్కడి పబ్‌లో జరిగిన దారుణకాండకు కారణంఏమిటనేది ఆరా తీస్తున్నారు. దుండగులను పట్టుకుంటేనే సంబందిత ఘటనపై కొంత సమాచారం నిర్ధారించుకునేందుకు వీలు అవుతుందని అధికారులు తెలిపారు.

## మేడారం మహా జాతర 2026 పోస్టర్ ఆవిష్కరించిన సీఎం



**అచ్చంపేట, డిసెంబర్ 21 (నిజాయితి) :** మేడారం మహా జాతర 2026 పోస్టర్‌ను ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి ఆదివారం ఆయన నివాసంలో ఆవిష్కరించారు. అతిపెద్ద ఆదివాసీ ఆధ్యాత్మిక వేడుక మేడారం శ్రీ సమ్మక్క–సారలమ్మ మహా జాతర 2026 జనవరి 28 నుంచి 31 వరకు జరగనుంది. మేడారం మహా జాతర పోస్టర్ ఆవిష్కరణ కార్యక్రమంలో మంత్రులు కొండా సురేఖ, ధనసరి అనసూయ (సీతక్క), పొంగులేటి శ్రీనివాస రెడ్డి, అడ్లూరి లక్ష్మణ్ కుమార్ పాల్గొన్నారు.

## నల్లధనం తెస్తామన్న హామీ ఏమైంది?.. కిషన్ రెడ్డిపై జగ్గా రెడ్డి ఫైర్



**హైదరాబాద్, డిసెంబర్ 21 (నిజాయితి) :** అధికారంలోకి రాగానే విదేశాల్లో ఉన్న నల్లధనం తెస్తామన్న హామీ ఏమైందని పిసిసి వర్కింగ్ ప్రెసిడెంట్ జగ్గారెడ్డి కేంద్ర మంత్రి జి. కిషన్ రెడ్డిని ప్రశ్నించారు. ఏఐసిసి అగ్ర నాయకురాలు సోనియా గాంధీకి కిషన్ రెడ్డి లేఖ రాయడంపై జగ్గారెడ్డి ఆదివారం విలేకరుల సమావేశంలో తీవ్రంగా మండిపడ్డారు. దేశ ప్రజలతో పాటు తెలంగాణ ప్రజలకు విదేశాల్లో ఉన్న నల్లధనం తెచ్చి ప్రతి అకౌంట్‌లో పదిహేను లక్షల రూపాయలు వేస్తామని బిజెపి ఎన్నికలకు ముందు హామీ ఇచ్చిందని ఆయన గుర్తు చేశారు. ఈ హామీ సంగతి ఏమైందో కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి చెప్పాలని ఆయన డిమాండ్ చేశారు. సంవత్సరానికి రెండు కోట్ల ఉద్యోగాలు ఇస్తామన్న హామీ ఏమైందని ఆయన ప్రశ్నించారు.

ఈ హామీల గురించి కిషన్ రెడ్డి ప్రధాని నరేంద్ర మోడీకి లేఖ రాయాలని ఆయన డిమాండ్ చేశారు. కిషన్ రెడ్డి ఆ విధంగా లేఖ రాస్తే తాము ఆయన లేఖకు సమాధానం ఇస్తామని జగ్గారెడ్డి అన్నారు. సోనియా గాంధీని ప్రశ్నించే నైతిక హక్కు బిజెపికి లేదని ఆయన దుయ్యబట్టారు. సోనియా గాంధీ హామీ ఇచ్చిన మహాలక్ష్మి పథకంలో మహిళలకు ఉచితంగా ఆర్టీసీ బస్సులో ప్రయాణించే సౌకర్యం కల్పించామని, ఐదు వందల రూపాయలకే వంట గ్యాస్ సిలెండర్ ఇస్తున్నామని జగ్గారెడ్డి తెలిపారు. అధికారంలోకి వచ్చి పదకొండు సంవత్సరాలు దాటినా ఇచ్చిన హామీలను బిజెపి నిలబెట్టుకోలేదని, తాము అధికారంలోకి వచ్చిన రెండేళ్ళలోనే ఆరు గ్యారంటీలను అమలు చేస్తున్నామని జగ్గా రెడ్డి తెలిపారు.

## రాష్ట్రపతి నిలయంలో ఎట్ హోం కార్యక్రమం



**హైదరాబాద్, డిసెంబర్ 21 (నిజాయితి) :** సికిందరాబాద్, బొల్లారంలోని రాష్ట్రపతి నిలయంలో ఆదివారం ఎట్ హెూం కార్యక్రమం ఘనంగా జరిగింది. రాష్ట్రపతి ద్రౌపది ముర్ము ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో రాష్ట్ర గవర్నర్ జిష్ణు దేవ్ వర్మతో కలిసి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పాల్గొన్నారు. ఆయనతో పాటు ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, మంత్రులు పొన్నం ప్రభాకర్, సీతక్క, కోమటిరెడ్డి వెంకట్రెడ్డి, పొంగులేటీ శ్రీనివాస్ రెడ్డి, శాసనసభ స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్, శాసన మండలి చైర్మన్ గుత్తా సుఖేందర్ రెడ్డి, మాజీ గవర్నర్ బండారు దత్తాత్రేయతో పాటు బిసి కమిషన్ చైర్మన్ జి. నిరంజన్ పలువురు ప్రజాప్రతినిధులు, ఉన్నతాధికారులు కార్యక్రమానికి హాజరయ్యారు. ఈ సందర్భంగా రాష్ట్రపతి ద్రౌపది ముర్ము అతిథులతో ఆత్మీయంగా మాట్లాడారు. కార్యక్రమం స్నేహపూర్వక వాతావరణంలో సాగింది.

## మోడీ అమిత్ షా నియంతృత్వ పాలనను తరిమికొట్టాలి

**- ఎమ్మెల్యే డాక్టర్ రాజేష్ రెడ్డి**



**నాగర్‌కర్నూల్, డిసెంబర్ 21 (నిజాయితి) :** కేంద్రంలోని ప్రధాని నరేంద్ర మోడీ కేంద్రమంత్రి అమిత్‌షా కాంగ్రెస్ పార్టీ అగ్ర నేతలపై కుట్రపూరితంగా కేసులు నమోదు చేయించడం బెదిరింపులకు పాల్పడడం జరుగుతుందని కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలు సైనికుల్లా పనిచేస్తూ నరేంద్ర మోడీ ప్రభుత్వాన్ని తరిమికొట్టే వరకు పోరాడాలని స్థానిక ఎమ్మెల్యే డాక్టర్ రాజేష్ రెడ్డి కోరారు.

ఆదివారం ఏఐసిసి పిలుపుమేరకు జిల్లా కేంద్రంలో ర్యాలీ నిర్వహించి అంబేద్కర్ చౌరస్తాలో నిర్వహించిన ధర్నాకు బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షులు విజయకుమార్ రెడ్డి అధ్యక్షత వహించగా ముఖ్యఅతిథిగా మంత్రి జూపల్లి కృష్ణారావు గారు హాజరయ్యారు

ఈ సందర్భంగా నిర్వహించిన ధర్నాలో ఎమ్మెల్యే రాజేష్ రెడ్డి గారు మాట్లాడుతూ దేశ స్వాతంత్రానికి పూర్వం ప్రజలను చైతన్యం చేసేందుకు ఏర్పాటు చేసిన నేషనల్ హెరాల్డ్ పత్రికను అడ్డం పెట్టుకొని కేంద్రంలోని ప్రభుత్వం ఏఐసిసి నాయకులైన సోనియాగాంధీ రాహుల్ గాంధీ అక్రమంగా కేసు నమోదు చేశారని కోర్టు సంబంధం లేదని తీర్పు ఇచ్చిన మనీ లాండరింగ్ కేసులు నమోదు చేయడం వారి అహంకార పాలనకు నిదర్శనం అని విరుచుకుపడ్డారు. సోనియా గాంధీ రాహుల్ గాంధీ లకు ప్రధాని అవకాశం వచ్చిన ఒక విద్యావేత్తను ప్రధాని చేసి త్యాగాలు చేశారని గుర్తు చేశారు. కేంద్రంలోని నరేంద్ర మోడీ ప్రభుత్వాన్ని ప్రతిపక్షంలో కూర్చోపెట్టే వరకు రాష్ట్రంలో ప్రజలను కాంగ్రెస్ పార్టీ నాయకులు కార్యకర్తలు చైతన్యం చేయాలని హెచ్చరించారు. తప్పుడు కేసులకు భయపడేది లేదని హెచ్చరించారు

## వాసవి క్లబ్స్ ఇంటర్నేషనల్ జాయింట్ సెక్రటరీగా మేడిశెట్టి రామకృష్ణ



**మహబూబ్ నగర్ ప్రతినిధి, డిసెంబర్ 21 (నిజాయితి) :** వాసవి క్లబ్స్ ఇంటర్నేషనల్ జాయింట్ సెక్రటరీగా మహబూబ్‌నగర్ జిల్లా జడ్చర్లకు చెందిన మేడిశెట్టి రామకృష్ణ నియామకమయ్యారు.

వాసవి క్లబ్స్ ఇంటర్నేషనల్ ఆధ్వర్యంలో వైష్టవి కన్వెన్షన్ శంషాబాద్‌లో ఆదివారం ఇంటర్నేషనల్ కన్వెన్షన్ నిర్వహించారు. ఈ సమావేశంలో 2026 సంవత్సరానికి గాను నూతన కమిటీని ఎన్నుకున్నారు. ఈ కమిటీలో జడ్చర్లకు చెందిన మేడిశెట్టి రామకృష్ణను ఇంటర్నేషనల్ జాయింట్ సెక్రటరీగా నియమించారు. రామకృష్ణ వాసవి క్లబ్ వేదికగా చేసిన సేవలను గుర్తించి ఇంటర్‌నేషనల్ స్థాయిలో జాయింట్ సెక్రటరీగా నియామకం చేయడం జరిగిందని ఇంటర్నేషనల్ అధ్యక్షులు సిద్ద సూర్య ప్రకాష్ రావు ఈ సందర్భంగా తెలిపారు. రామకృష్ణ నియామకం పట్ల పలువురు హర్షం వ్యక్తం చేశారు.

### అల్లం ఎల్లిపాయ, హారేకు మాల్ మైకు సౌండ్లతో

## విసిగి పోతున్న తరుణంలో మా కొత్త సర్పంచ్ వేయించిన డప్పు దండోరా

### మా చెవులకు నూతన ఉత్సాహం



**తెల్కపల్లి, డిసెంబర్ 21 (నిజాయితి) :** అల్లం ఎల్లిపాయ, హారేకు మాల్ ఒక్కడేంది ఇంతోడు అంతోడు ఎంతెంతో మైకు రంతులు చేస్తూ పొద్దున లేస్తే ఇండ్ల చుట్టు తిరుగుతుంటే యాసారుకొచ్చి దిగాలు పడుతున్న తరుణంలో మా కొత్త సర్పంచ్ కడుపు చల్లగుండ మంచిగ డప్పు చాటింపు చేపిచ్చి ఉత్సాహం కలిగించిండని తెల్కపల్లి గ్రామస్తులు పాత రోజులను తల్చుకుంటున్నారు. మొన్న గ్రామంలో బోనాలు తీస్తుంటే బైండ్ల ఆయనను పిలువనీకె పోతే నిస్టూరంగ మాట్లాడి ఊల్లె సాటింపు చేసి ఓపూట తింటున్న నా కడుపు కొట్టి మైకులు పెట్టింద్రు కదా గిప్పుడు నేనెందుకమ్మా బోనాల కాడికి అన్నడు. కాని ఈ సారి బోనాలకు వస్తనంటున్నడని గ్రామస్తులు సంతోష పడుతున్నరు.

## గొర్రెలు మరియు మేకలలో ఉచితంగా నట్టల నివారణ కార్యక్రమం






**నాగర్‌కర్నూల్, డిసెంబర్ 21 (నిజాయితి) :** నాగర్‌ర్నూల్ జిల్లా లోని 20 మండలాలలో ఉన్న 9,67,926 గొర్రెలు మరియు 2,06,403 మేకలకు (మొత్తం11,74,329) జిల్లా పశు వైద్య మరియు పశు సంవర్ధక శాఖ ద్వారా ఉచితంగా నట్టల నివారణ కార్యక్రమం తేదీ:22.12.2025 నుండి 31.12.2025 వరకు 10 రోజుల పాటు నిర్వహించబడుతుందని, ఈ కార్యక్రమంలో మండలాల వారిగా సిబ్బంది 50 బృందాలుగా ఏర్పడి అన్ని గ్రామాల్లో ఈ కార్యక్రమం చేపడతారని, గొర్రెల మేకల పెంపకందారులందరు ఈ సదవకాశాన్ని వినియోగించుకొని నట్టల మందులను వారి జీవాలకు త్రాగించుకోవలసిందిగా పశు సంవర్ధక శాఖ జిల్లా పశు వైద్య మరియు పశు సంవర్ధక అధికారి డా.బి.జ్ఞాన శేఖర్ ఒక ప్రకటన ద్వారా తెలియజేశారు. నట్టల మందులు త్రాగించడం వలన, జీవాలలో ఉన్న అంతర్ పరాన్న జీవులు నశించి ఆరోగ్యంగా, బరువు పెరగటం తో పాటు పునరుత్పత్తి సామర్థ్యం కూడా పెరుగుతుంది. జీవాలు అంటు వ్యాధుల బారిన పడకుండా వ్యాధి నిరోధక శక్తి పెరుగుతుందని ఈ మేకరు విడుదల చేసిన ప్రకటనలో ఆయన పేర్కొన్నారు.

ఆదివారం,
డిసెంబర్ 21, 2025
TGTEL/25/A3750 ... నిజమే ...
నిజాయితీ
https://nijamenijayathi.com తెలుగు దిన పత్రిక



# ప్రజల తరపున మీ అందరికీ హృదయ పూర్వక శుభాకాంక్షలు - కొర్ర ఈశ్వర్ లాల్, ఓయూ



హైదరాబాద్, డిసెంబర్ 21 (నిజాయితి) :
స్థానిక సంస్థల ఎన్నికలలో సర్పంచ్ ,ఉప సర్పంచ్ వార్డు మెంబర్ల గా ఎన్నికై ప్రజాప్రతినిధులగా పదవి స్వీకారం చేపడుతున్న మీ అందరికీ శుభాకాంక్షల సందేశం. స్థానిక సంస్థల ఎన్నికల అనంతరం అప్పాయింట్మెంట్ డే రోజునా పోటీలో ఎంత మంది ఉన్న గెలుపు మీకు దక్కింది, ప్రజల ఆశీర్వాదం తో, అదృష్టం వరించి నేటి నుండి సర్పంచ్‌గా, ఉపసర్పంచ్‌గా, వార్డు మెంబర్లుగా ప్రమాణస్వీకారంతో గ్రామ సేవకు శ్రీకారం చుడుతున్న సమస్త ప్రజా ప్రతినిధులకు హృదయపూర్వక శభాకాంక్షలు. మీరు స్వీకరించబోయే ప్రమాణం కేవలం పదవి స్వీకరణ కాదు – అది భారత రాజ్యాంగం పట్ల గౌరవం, చట్టాల పట్ల విధేయత, ప్రజల పట్ల సేవాభావానికి ఇచ్చే మాట, నిలుపుకునే బాధ్యత.... మీ కర్తవ్య దీక్ష..

"గ్రామ స్వరాజ్యం నుంచే నిజమైన ప్రజాస్వామ్యం మొదలవుతుంది" – మహాత్మా గాంధీ

ఈ గ్రామ ప్రజలు మీపై ఉంచిన విశ్వాసాన్ని , ఇచ్చిన హామీలను నిలబెట్టుకుంటూ, మాటలు చెప్పడం కాదు చేతల్లో గ్రామ సమస్యలను గుర్తించి, వాటికి ప్రాధాన్యత క్రమంలో పరిష్కారాలు చూపుతూ, గ్రామపంచాయతీ నిధులను , విధులను చట్టబద్ధంగా, పారదర్శకంగా, సమర్ధంగా ఖర్చు చేస్తారని ఆశిస్తున్నాము. మీ పాలనలో అభివృద్ధి ప్రతి ఇంటికీ చేరాలి సంక్షేమం చివరి వ్యక్తిని కూడా సంతోష పరచాలి. నిర్ణయాల్లో ప్రజల భాగస్వామ్యం ఉండాలి పనుల్లో జవాబుదారీతనం స్పష్టంగా కనిపించాలి

"రాజ్యాంగం ఎంత గొప్పదైనా, దాన్ని అమలు చేసే వారు మంచివారైతేనే అది ఫలిస్తుంది" – డా. బి.ఆర్. అంబేద్కర్

మీరు రాబోయే ఐదు సంవత్సరాల పాలనను ప్రజల ఆకాంక్షలకు, ఆశయాలకు అనుగుణంగా నిష్పక్షపాతంగా, అవినీతి రహితంగా, ఆదర్శవంతంగా నిర్వహిస్తూ
ఈ గ్రామానికి మంచి పేరు తీసుకురావాలని కోరుకుంటున్నాము.

"ప్రజాసేవే నిజమైన రాజకీయం" –జవహర్‌లాల్ నెహ్రూ

గ్రామ అభివృద్ధి అనేది రోడ్లు, భవనాలతో మాత్రమే కాదు – విద్య, ఆరోగ్యం, పరిశుభ్రత, మహిళా సాధికారత, యువత ఉపాధి వంటి అంశాలతో కూడిన సమగ్ర అభివృద్ధిగా మారాలి.

"మంచి పాలన అంటే ప్రజల జీవితాల్లో మార్పు రావడమే" – డా. ఏ.పీ.జే. అబ్దుల్ కలాం

మీ పాలన, ప్రజా ప్రతినిధిగా గ్రామానికి ఆదర్శంగా నిలిచి, రాబోయే తరాలకు ఒక స్ఫూర్తిదాయక ఆదర్శ నాయకుడిగా మారాలని హృదయపూర్వకంగా ఆకాంక్షిస్తూ.
మీ అందరికీ మరోసారి శుభాకాంక్షలు. గ్రామం కోసం – ప్రజల కోసం – రాజ్యాంగ విలువల కోసం మీ సేవ నిరంతరం కొనసాగాలని కోరుకుంటున్నాము.

# క్రీడలతో శారీర దారుఢ్యంతో పాటు క్రమ-శిక్షణ, నాయకత్వ లక్షణాలు సమృద్ధిగా లభిస్తాయి

## -ఎమ్మెల్యే కూచుకుళ్ల రాజేష్ రెడ్డి

నాగర్‌కర్నూల్, డిసెంబర్ 21 (నిజాయితి) :
క్రీడలతో శారీరక దారుఢ్యంతో పాటు క్రమశిక్షణ, నాయకత్వ లక్షణాలు సమృద్ధిగా లభిస్తాయని నాగర్‌కర్నూల్ ఎమ్మెల్యే డా. కూచుకుళ్ల రాజేష్ రెడ్డి అన్నారు. నాగర్‌కర్నూల్ పట్టణ కేంద్రంలోని జెడ్పి స్కూల్ గ్రౌండ్‌లో నిర్వహిస్తున్న ఆల్ ఇండియా క్రికెట్ టోర్నమెంట్‌కు ముఖ్య అతిథిగా ఆయన హాజరయ్యారు.

ఈ సందర్భంగా తొలి మ్యాచ్‌గా న్యూ స్టార్ నాగర్‌కర్నూల్ %జం% కిల్లర్ సీసీ చెన్నై జట్ల మధ్య జరిగిన పోటీకి ఎమ్మెల్యే గారు టాస్ వేసి మ్యాచ్‌ను అధికారికంగా ప్రారంభించారు.

క్రీడాకారులను ఉత్సాహపరిచిన ఎమ్మెల్యే మాట్లాడుతూ, యువత క్రీడల వైపు మరింతగా ఆకర్షితులవ్వాలని, క్రీడలతో శారీరక దృఢత్వంతో పాటు క్రమశిక్షణ, నాయకత్వ లక్షణాలు పెంపొందుతాయని తెలిపారు.




క్రీడల అభివృద్ధికి ప్రభుత్వం తరపున, తన వంతు సహకారం ఎల్లప్పుడూ ఉంటుందని ఎమ్మెల్యే గారు భరోసా ఇచ్చారు. నాగర్ కర్నూల్ పట్టణాన్ని క్రీడలకు కేంద్రంగా అభివృద్ధి చేయాలనే లక్ష్యంతో ముందుకు సాగుతున్నామని అన్నారు.

ఈ కార్యక్రమంలో మార్కెట్ కమిటీ ఛైర్మెన్ రమణ రావు గారు ,సీనియర్ క్రికెటర్లు, మాజీ కౌన్సిలర్లు, క్రీడాభిమానులు తదితరులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# బెల్ట్ గ్రేడింగ్ టెస్ట్ నిర్వహణ



మహబూబ్ నగర్, డిసెంబర్ 21 (నిజాయితి):
డ్రాగన్ షోటోకాన్ కరాటే–డో స్పోర్ట్స్ ఆధ్వర్యంలో బెల్ట్ గ్రేడింగ్ టెస్ట్ విజయవంతంగా నిర్వహించబడింది. ఈ కార్యక్రమంలో పాల్గొన్న చిన్నారులకు వారి ప్రతిభను గుర్తించి అవార్డులు, పతకాలను అందజేశారు.

ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా మహబూబ్‌నగర్ జిల్లా డీసీసీ అధ్యక్షులు శ్రీ సంజీవ్ ముదిరాజ్ గారు హాజరై చిన్నారులను అభినందించి, వారి క్రీడా ప్రతిభను ప్రోత్సహించారు. కరాటే వంటి క్రీడలు శారీరక దృఢత్వంతో పాటు ఆత్మవిశ్వాసాన్ని పెంపొందిస్తాయని సంజీవ్ ముదిరాజ్ గారు పేర్కొన్నారు.

కార్యక్రమంలో మాజీ మున్సిపల్ చైర్మన్ ఆనంద్ గౌడ్
మహబూబ్ నగర్ మైనారిటీ డిపార్ట్మెంట్ చైర్మన్ మహ్మద్ ఫయాజ్, బెక్కరి మధుసూదన్ రెడ్డి కోఆర్డినేటర్ మహబూబ్ నగర్ అసెంబ్లీ.
ఎంపీ ప్రవీణ్ కుమార్, బి చాదు యాదవ్, రియాజ్. వడ్ల రాకేష్. కాంగ్రెస్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

ఈ కార్యక్రమానికి ప్రత్యేకంగా ఆహ్వానించువారు:
సలాం బిన్ ఉమర్ – డీఎస్‌కేడీఎస్ అధ్యక్షులు
అబ్దుల్ సలాం – డీఎస్‌కేడీఎస్ కార్యదర్శి
సి. అంబ్రేష్ – చీఫ్ ఎగ్జామినర్
కె. అంజన్ ప్రసాద్ – ఉపాధ్యక్షులు
విజయ్ కృష్ణ – ఖజానాదారు
ఎం.డి. సలీం – టోర్నమెంట్ ఇన్‌చార్జ్
సెన్సై సుల్తాన్

# బగీరథ కాలనీలో అయ్యప్ప పడిపూజ పాల్గొన్న డిసిసి చైర్మన్



మహబూబ్ నగర్, డిసెంబర్ 21 (నిజాయితి):
మహబూబ్‌నగర్ బగీరథ కాలనీలో నిర్వహించిన శ్రీశ్రీ అయ్యప్ప స్వామి పూజా కార్యక్రమంలో మహబూబ్‌నగర్ జిల్లా డీసీసీ అధ్యక్షులు సంజీవ్ ముదిరాజ్ పాల్గొన్నారు. ఈ పూజా కార్యక్రమంలో ఎంపీ ప్రవీణ్ కుమార్, చందు యాదవ్, రియాజ్, వడ్ల రాకేష్ తదితరులు పాల్గొని స్వామివారిని దర్శించుకొని ప్రత్యేక పూజలు నిర్వహించారు.
అలాగే ఈ పవిత్రమైన అయ్యప్ప స్వామి పూజా కార్యక్రమానికి ఆహ్వానించువారు యేనికె యాదగిరి (రిటైర్డ్ ఎస్సై)
ఈ కార్యక్రమం భక్తిశ్రద్ధలతో, ఆధ్యాత్మిక వాతావరణంలో విజయవంతంగా సాగింది.

# కాంగ్రెస్ ప్రభుత్వానికి బజరంగ్ దళ్ హెచ్చరిక

రంగారెడ్డి, డిసెంబర్ 21 (నిజాయితి):



హిందువుల దేవాలయాలంటే ఇంత అలుసా? హిందూ దేవాలయాలు మీ పార్టీ కార్యాలయాలనుకున్నారా జెండాలు కట్టడానికి అంటూ అటు రాజకీయ పార్టీలను, అధికారులను ప్రశ్నిస్తున్నారు బజరంగ్ దళ్ విభాగ్ కన్వీనర్ గూడెం రమేష్ రంగారెడ్డి జిల్లా షాబాద్ మండలం చందనవెల్లి గ్రామంలో అమ్మవారి ఆలయంపై కాంగ్రెస్ పార్టీ జెండాలు,తోరణాలు ఏర్పాటు చేయడాన్ని బజరంగ్ దళ్ తీవ్రంగా ఖండించింది. ఈ వ్యవహారంపై బజరంగ్ దళ్ విభాగ్ కన్వీనర్ గూడెం రమేష్ ఘాటుగా స్పందించారు.

# ఐద్వా జాతీయ మహాసభలను జయప్రదం చేయండి

## ఐద్వా రాష్ట్ర ఉపాధ్యక్షురాలు కందికొండ గీత

నాగర్‌కర్నూల్, డిసెంబర్ 21 (నిజాయితి) :
అఖిలభారత ప్రజాతంత్ర మహిళా సంఘం ఐద్వా 14వ జాతీయ మహాసభలు జయప్రదం చేయాలని నాగర్ కర్నూల్ జిల్లా కేంద్రంలోని సిఐటియు కార్యాలయంలో ముఖ్య కార్యకర్తల సమావేశం నిర్వహించడం జరిగింది

ఈ సందర్భంగా ఐదువ రాష్ట్ర ఉపాధ్యక్షురాలు కందికొండ గీత మాట్లాడుతూ అఖిలభారత ప్రజాతంత్ర మహిళా సంఘం ఐద్వా 14వ జాతీయ మహాసభలు తెలంగాణ రాష్ట్ర రాజధాని హైదరాబాదు నగరంలో 2026 జనవరి 25 నుండి 28 తేదీలలో మొదటిసారి గా జరుగుచున్నవి ఈ మహాసభలు జయప్రదం చేయాలని ఆమె పిలుపునిచ్చారు నాలుగు రోజులపాటు జరిగే ఈ మహాసభలలో దేశవ్యాప్తంగా మహిళలు ఎదుర్కొనే ప్రధానమైన సమస్యలు చర్చించి రూపొందించబోయే భవిష్యత్ కార్యాచరణ, మహిళా ఉద్యమాలకు దిశా నిర్దేశం చేయనున్నవి అన్నారు కేంద్రంలో ఎన్డీఏ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక ఈ పదేళ్ల కాలంలో మహిళలు,మైనార్టీలు దళితులు, అట్టడుగు, వర్గాలకు,భద్రతా కరువైందన్నారు,మహిళలపై హింస అభద్రత నిరుద్యోగం పెరిగిందన్నారు తగ్గుతున్న, స్త్రీపురుష, నిష్పత్తి విద్య వైద్యం,ప్రజలందరికీ,అందుబాటులో లేకపోవడం,పెరుగుతున్న,నిత్యవసర వస్తువుల ధరలు ఒకవైపు పని దొరక్క పోవడం మహిళలు.సమస్యల వలయంలో కి నెట్టి వేయబడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు మహిళలు ఏ బట్టలు వేసుకోవాలి ఏ తిండి తినాలో ఎంతమంది పిల్లల్ని కనాలి అని బిజెపి ప్రభుత్వమే




నిర్ణయించడం దుర్మార్గమని ఆమె అన్నారు మనువాదం.మహిళల. కుస్వేచ్ఛ స్వతంత్రం, ఉండకూడదని,బానిసలుగా బ్రతకాలని శాసిస్తోందన్నారు ఈ మహాసభలలో,మహిళా,సమస్యలపై చర్చించి భవిష్యత్,కార్యాచరణ రూపొందిస్తుందన్నారు, ప్రజాస్వామ్యం సమానత్వం.స్త్రీ విముక్తి.ఆశయాల కోసం జీవితకాలం,మహిళా,హక్కుల కోసం ,మహిళలు, నిరంతరం పోరాటంలో కొనసాగాలని పిలుపునిచ్చారు ఈ కార్యక్రమంలో జిల్లా కమిటీ సభ్యులు జిల్లా అధ్యక్షురాలు నిర్మల సహాయ కార్యదర్శి దీప వెంకటమ్మ ఈశ్వరమ్మ సైదమ్మ తదితరులు పాల్గొన్నారు

# నూతన సర్పంచ్‌ను సన్మానించిన ఐఎన్‌టియుసి నాయకులు



అచ్చంపేట, డిసెంబర్ 21 (నిజాయితి):
పల్కపల్లి గ్రామంలో కాంగ్రెస్ పార్టీ బలపర్చిన అభ్యర్థి నూతన సర్పంచ్ ఎంపికైన సంతోష్ రెడ్డిని, మరియు ఉపసర్పంచ్ జహంగీర్‌ని ఐఎన్‌టియుసి అచ్చంపేట కమిటీ ఘనంగా సన్మానించడం జరిగినది. ఐఎన్‌టియుసి తాలూకా అధ్యక్షులు మహబూబ్ అలీ అచ్చంపేట మండలం ఐఎన్‌టియుసి ఉపాధ్యక్షులు మౌలానాతో పాటు ఈ కార్యక్రమంలో పల్కపల్లి గ్రామ పెద్దలు జగపతి రెడ్డి బాల్రెడ్డి వెంకటయ్య గౌడ్ శ్రీను, రేణుక రెడ్డి, లక్ష్మీపతి పాల్గొన్నారు

# ఈ మహిళా సంఘం భవనాన్ని త్వరితగతిన పూర్తి చేయాలి

## -ఎమ్మెల్యే శ్రీ యెన్నం శ్రీనివాస్ రెడ్డి



మహబూబ్ నగర్, డిసెంబర్ 21 (నిజాయితి) :
నగరంలోని ఎంప్లాయిస్ కాలనీలో నూతనంగా నిర్మిస్తున్న మహిళా సంఘం భవనాన్ని గౌరవ మహబూబ్‌నగర్ ఎమ్మెల్యే శ్రీ యెన్నం శ్రీనివాస్ రెడ్డి గారు ఆదివారం పరిశీలించారు. నిర్మాణపు పనుల పురోగతిని క్షుణ్ణంగా పరిశీలించిన అనంతరం భవన నిర్మాణ నాణ్యత, ఉపయోగిస్తున్న సామగ్రి, పనుల వేగం తదితర అంశాలపై కాంట్రాక్టర్‌ను వివరంగా అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా కాంట్రాక్టర్ ఆంజనేయులతో మాట్లాడిన ఎమ్మెల్యే గారు, మహిళలకు ఉపయోగపడే విధంగా భవనాన్ని అన్ని సౌకర్యాలతో నిర్మించాల్సిన అవసరం ఉందని తెలిపారు. భవన నిర్మాణం ఆలస్యం కాకుండా, నిర్ణీత కాలవ్యవధిలో పూర్తి చేసి మహిళా సంఘాల సభ్యులకు అందుబాటులోకి తీసుకురావాలని స్పష్టంగా ఆదేశించారు. మహిళా సంఘాల సమావేశాలు, శిక్షణ కార్యక్రమాలు, సామాజిక కార్యక్రమాలకు ఈ భవనం ఉపయోగపడుతుందని ఆయన పేర్కొన్నారు. పనుల్లో నాణ్యత విషయంలో ఎలాంటి రాజీ పడబోమని, ప్రతి అంశాన్ని పర్యవేక్షిస్తూ ముందుకు తీసుకెళ్తామని ఎమ్మెల్యే గారు తెలిపారు. మహిళల సాధికారతకు ఇటువంటి మౌలిక సదుపాయాలు ఎంతో అవసరమని, మహిళా సంఘం భవనం వారి అభివృద్ధికి కేంద్రంగా మారుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే గారితో పాటు, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు వినోద్ కుమార్, డిసిసి ప్రధాన కార్యదర్శి సిరాజ్ ఖాద్రీ, నాయకులు అర్షద్ తదితరులు పాల్గొన్నారు.